విధుల్లో నిర్లక్ష్యం.. ఎస్‌ఐపై విచారణ

ఉప్పల్: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ఉప్పల్ ఎస్ఐ శంకర్‌ను మల్కాజిగిరి డీసీపీ కార్యాలయానికి అటాచ్ చేసి విచారణ చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. వారం క్రితం ఉప్పల్ భగాయత్‌కు వచ్చిన ఓ జంటను వీడియోలు తీసిన పోకిరీలు వారిని బ్లాక్‌మెయిల్ చేసి మూడు లక్షల రూపాయలు డిమాండ్ చేశారు. దీంతో ఆ జంట ఉప్పల్ పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసిన ఎస్ఐ శంకర్ విచారణ చేపట్టారు. ఈ క్రమంలో ఎస్ఐ శంకర్ భారీగా ముడుపులు తీసుకొని కేసును నీరుగార్చారనే విషయం సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో సమాచారం అందుకున్న పోలీసు ఉన్నతాధికారులు ఎస్ఐ శంకర్‌పై విచారణకు ఆదేశించారు. ఈ విషయంపై మరింత సమాచారం తెలుసుకునే ప్రయత్నం చేయగా పోలీసు ఉన్నతాధికారులు అందుబాటులోకి రాలేదు.


ఎస్ఐ శంకర్

ఎల్‌వోసీ అందజేత


ఎల్‌వోసీని అందజేసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: బీజేఆర్ నగర్‌కు చెందిన శోభారాణి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం ఎల్‌వోసీకి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన లక్షా ఏభై వేల రూపాయల ఎల్‌వోసీ మంజూరు పత్రాన్ని శోభారాణి కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మురుగేష్, ఉపేందర్, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ దేవాలయ వార్షికోత్సవం



మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీశ్రీ పోచమ్మ తల్లి 5వ వార్షికోత్సవం సందర్భంగా పీర్జాదిగూడ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ శనివారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నన బోలు రాజశేఖర్ రెడ్డి, చెరుకు మహేష్ గౌడ్, పానుగంటి బృందాకర్ గౌడ్, అల్వాల్ నర్సింహాగౌడ్, ముత్యాల గౌడ్, శేఖర్ గౌడ్, జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి సమస్యలపై ప్రజావాణి

ఉప్పల్: మంచినీటి సరఫరా, మురుగునీటి సమస్యలపై ప్రజావాణి కార్య క్రమాన్ని ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు బీర్బగడ్డ డివిజన్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు జలమండలి జీఎం సంతోష్‌కుమార్ తెలిపారు. మంచినీటి సరఫరా, మురుగు సమస్యలపై ఫిర్యాదులు, సమస్యలపై దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా అతుల్య ఆర్ట్స్ అకాడమీ లక్ష్మీదుర్గా శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహుతులను అలరించింది. మూషిక వాహన, బ్రహ్మాంజలి, మహాగణపతి, ఇదిగో భద్రాద్రి మొదలైన అంశాలను లాస్యప్రణవి, సోనాలిక, ఆద్య, వెరోనికా వేదం, శాన్వి, తనూజ, ప్రవల్లి, ధన్వి, అభిజ్ఞల కూచిపూడి నృత్య ప్రదర్శన అందరినీ మెప్పించింది.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి




మల్లాపూర్: ఓల్డ్ మల్లాపూర్‌లోని కొండిన్య భవనం మొదటి అంతస్తులోని పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులకు మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి సూచించారు. గౌడ్ సంఘం ప్రతినిధుల విజ్ఞప్తికి కార్పొరేటర్ శనివారం ఆ పనులను పరిశీలించారు. వెంటనే పనుల్లో వేగం పెంచి పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ ఏఈ ప్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, దంతురి రాజుగౌడ్, మెరుపుల బాలరాజ్ గౌడ్, కోయకూర బాలరాజ్ గౌడ్, కప్పెర సాయి, రాంపల్లి సాయి, రాజేష్, సాయి, రఘు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అరోరాలో ముగిసిన అన్వేషణ టెక్నో ఫెస్ట్

రామంతాపూర్: అరోరా ఆటామనస్ పీజీ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న టెక్నో కల్చరల్ ఫెస్ట్ శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటులు వరుణ్ సందేశ్, దివ్యాదిత్య ప్రత్యేక ఆహ్వానితులుగా వచ్చి తమ ఆటపాటలతో ఆహుతులను అలరించారు. అనంతరం సాయంత్రం జరిగిన కార్యక్రమానికి విశిష్ట అతిథిగా కామర్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ ప్రమోషన్స్ కమిషనరేట్ డిప్యూటీ డైరెక్టర్ సుధీర్‌పాల్, డాక్టర్ నవీన్ మాదిశెట్టి హాజరై విద్యార్థులకు వ్యాపార మెళకువలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.మాధవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలిసెట్ ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం



రామంతాపూర్: ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలో వివిధ డిప్లొమా పోస్టుల ప్రవేశానికి నిర్వహించిన పాలీసెట్ ఎంట్రెన్స్ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు శనివారం రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. స్లాట్లు బుక్ చేసుకున్న పలువురు అభ్యర్థులకు అధికారులు ధ్రువపత్రాల పరిశీలన జరిపారు. ఈ నెల 25 వరకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని, 25 నుంచి 27 వరకు వెబ్ ఆప్షన్ల ఎంపిక, 30 లోపు సీట్ల కేటాయింపు ఉంటుందని ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్ తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా వివిధ డిప్లొమా కోర్సుల్లో 1.122 సీట్లు అదనంగా చేరాయని వీటన్నిటినీ కన్వీనర్ కోటాలో కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేస్తారని ఆయన పేర్కొన్నారు.

మారుతీనగర్ వద్ద పూడిక తీయకుండా వదిలేసిన డ్రైన్



చక్రిపురం హైటెన్షన్ వద్ద పూడిక తీయకుండా వదిలేసిన డ్రైన్



చేసీ చేయనట్టుగా.. చూసీ చూడనట్టుగా!

వర్షాకాలం ప్రారంభమైనా తూతూమంత్రంగా నాలాల పూడికతీత
- కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం.. అధికారుల నిర్లిప్తత
- కాప్రా సర్కిల్‌లో కోట్ల రూపాయలు దుర్వినియోగం


నాగార్జుననగర్ బస్‌స్టాప్ నుంచి చక్రిపురం చౌరస్తా వరకు పరిస్థితి ఇదీ

కుషాయిగూడ: వర్షాకాలంలో వరదలు, ముంపు సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం ప్రతి ఏటా కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నా ఆశించిన ఫలితాలు రావడం లేదు. దీనికి అధికారుల నిర్లిప్తత, కాంట్రాక్టర్ల అవినీతే కారణమనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. కాప్రా సర్కిల్‌లో నాలాల పూడికతీత పనులుతూతూమంత్రంగా సాగుతున్నాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వర్షాకాలం ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా ఇప్పటికీ చాలా చోట్ల పనులు అసంపూర్తిగా ఉండటం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది.

రూ.1.31 కోట్లు మంజూరు..

కాప్రా సర్కిల్ పరిధిలోని కాప్రా, ఏఎస్‌రావునగర్, చర్లపల్లి, మీర్‌పేట్-హెచ్‌బీ కాలనీ, మల్లాపూర్, నాచారం డివిజన్‌లలో నాలాల పూడికతీత, స్టామ్‌వాటర్ లేన్ల క్లినింగ్, మరమ్మతులు, బకెట్ క్లీనింగ్ పనుల కోసం 1.31 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. అందులో 42 లక్షలు చర్లపల్లి డివిజన్‌కు, మీర్‌పేట్-హెచ్‌బీ కాలనీ డివిజన్‌కు రూ12 లక్షలు కేటాయించారు.

మే చివరి కల్లా పూర్తి చేయాలి..

గత ఏప్రిల్‌లో టెండర్ పూర్తయిన ఈ పనులను వర్షాకాలం ఆరంభానికి ముందే పూర్తి చేయాల్సి ఉంది. అంటే మే చివరి కల్లా దాదాపుగా నాలాల పూడికతీత, స్టామ్‌వాటర్ లేన్‌ల క్లినింగ్, బకెట్ క్లీనింగ్ పనులు పూర్తి చేయాలి. జూన్ మాసం పూర్తి కావస్తున్న నేటికీ చాలా చోట్ల పూడికతీత, బకెట్ క్లీనింగ్ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. చర్లపల్లి డివిజన్ పరిధిలోని చక్రిపురం హైటెన్షన్ లేన్, మారుతీనగర్ కల్వర్టు వద్ద, నాగార్జుననగర్ కాలనీ మెయిన్ రోడ్డు బస్‌స్టాప్ నుంచి చక్రిపురం చౌరస్తా వరకు, చర్లపల్లి, ఈసీనగర్‌లో ఇంకా పూడికతీత చేపట్టలేదు. బకెట్ క్లీనింగ్ చేసిన దాఖలాలే కనిపించడం లేదు. తరచుగా డ్రైనేజీ సమస్య తలెత్తే భరత్‌నగర్ కాలనీ మినహా సాయినగర్, నాగర్జుననగర్, బీఎన్‌రెడ్డినగర్, చర్లపల్లి, మింట్ కాలనీ, ఈసీనగర్ కాలనీల్లో ఇప్పటి వరకు బకెట్ క్లీనింగ్ పనులు చేయలేదు.

పనుల్లో జాప్యం వాస్తవమే

కాప్రా సర్కిల్‌లో నాలాల పూడికతీత, స్టామ్ వాటర్ లేన్ల క్లీనింగ్ పనులు కొన్నిచోట్ల పూర్తి కాగా, మరికొన్ని చోట్ల ఇంకా పనులు జరుగుతున్నాయి. మే చివరికల్లా పూర్తి కావాల్సిన పనులు కొంచం ఆలస్యమయ్యాయి. త్వరలోనే పూర్తి చేస్తాం.
–హరిలాల్, ఇంజనీరింగ్ ఈఈ

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందచేస్తున్న కాలనీవాసులు

అల్వాల్: వెంకటాపురం డివిజన్ శ్రీ సాయి రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, గ్రీన్‌ఫీల్డ్స్ కాలనీ, కానాజీగూడ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం కాలనీవాసులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశారు. కాలనీల్లో ఓపెన్ నాలా పనులు పూర్తి చేయాలని, తాగునీటి పైపులైన్ మార్చాలని, డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే స్పందిస్తూ వెంటనే సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కాలనీవాసులు గంధం అనిల్‌కుమార్, శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి చెత్తనివారణపై స్పెషల్ డ్రైవ్

మల్కాజిగిరి:మల్కాజిగిరి డివిజన్‌లో చెత్త సమస్య నివారణ కోసం ఆదివారం నుంచి స్పెషల్ డ్రైవ్ ప్రారంభమవుతుందని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. మల్కాజిగిరిను మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు. అందులో భాగంగా శనివారం అడిషనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి సర్కిల్ సమక్షంలో అధికారులతో సమావేశం నిర్వహించామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త పడేయకుండా ప్రజలకు అవగాహనతోపాటు చెత్త సేకరించే వాహనాలను ఉపయోగించుకోవడం, భవన నిర్మాణవ్యర్థాలను జీహెచ్‌ఎంసీకి అందజేయడం లాంటి అంశాలపై ప్రచారం నిర్వహిస్తామన్నారు. మల్కాజిగిరి డివిజన్‌లో విజయవంతమైతే గ్రేటర్‌లోని అన్ని డివిజన్లలో అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని అడిషనల్ కమిషనర్ తెలిపారన్నారు. సమావేశంలో డీఈ మాధవి, ఎస్ఎస్‌లు శ్రీనివాస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సేవాభారతి సేవలు ప్రశంసనీయం


గ్రాడ్యుయేషన్‌డేలో ప్రముఖులు, విద్యార్థులు

మల్కాజిగిరి: సేవాభారతి ఎన్‌జీవో సేవలు ప్రశంసనీయమని సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ హైదరాబాద్ చీఫ్ జనరల్ మేనేజర్ శ్రీకర ప్రధాన్ అన్నారు. శనివారం మల్కాజిగిరి వాత్సల్యసింధు ఆశ్రమంలో బోయినపల్లి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ జనరల్ డ్యూటీ అసిస్టెంట్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శ్రీకర ప్రధాన్ మాట్లాడుతూ విద్యార్థులకు శిక్షణ ఇవ్వడమే కాకుండా ఆస్పత్రుల్లో ప్లేస్‌మెంట్‌కు కృషి చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమలో న్యూఢిల్లీ రాష్ట్రీయ సేవాభారతి అధ్యక్షుడు పన్నాలాల్‌జీ, స్కిల్ డెవలప్‌మెంట్ సీఈవో ఆశిష్ జైన్, జనరల్ మేనేజర్ దుర్గాప్రసాద్, తెలంగాణ సేవాభారతి అధ్యక్షుడు దుర్గారెడ్డి, కుల్దీప్ సక్సేనా, రామమూర్తి, సేవాభారతి ప్రతినిధులు, వాలంటీర్స్ పాల్గొన్నారు.

శ్రీ వెంకటేశ్వర కాలనీ వెల్ఫేర్ కమిటీ ఎన్నిక

ఉప్పల్: ఉప్పల్ శ్రీ వెంకటేశ్వర కాలనీ, ఆదర్శనగర్ కాలనీ కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ అధ్యక్షుడిగా యాసోజు నర్సింహచారి, ఉపాధ్యక్షులుగా మార్కాపురం పేరయ్య, రాచకట్ల సురేష్, గజిభీమాకార్ రవీందర్, ప్రధాన కార్యదర్శిగా మేడిగ శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శులుగా దుద్యాల వెంకటేష్, గంగిశెట్టి అనిల్, తెల్కల శ్రీనివాస్‌రెడ్డి, కాలేరు ఉపేందర్, చెన్నోజు రామాచారి, కోశాధికారిగా ఇల్లందుల సురేందర్‌బాబు, కార్యవర్గ సభ్యులుగా గోదల మహేందర్ యాదవ్, ఏడుగాని బాలకృష్ణ, ఏడోజు కుమారస్వామిచారి, మంచికంటి రాములు, సలహాదారులుగా కందాల వెంకటాచారి, కప్పల వెంకటేష్‌గౌడ్, బండ నల్లారెడ్డి, కర్ల మధుసూదన్‌రెడ్డి, ధరావత్ శ్రీనివాసరావు, కప్పల లింగయ్యగౌడ్, సంకోజు బ్రహ్మచారి ఎన్నికయ్యారు.

బిల్డర్‌పై చర్యలు తీసుకోవాలని ఆందోళన

ఉప్పల్: ఉప్పల్ ఎస్ఎస్ఎస్ ఈస్ట్ కౌంటీ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ కొనుగోలు చేసిన యజమానులు శనివారం ఆందోళన చేపట్టారు. బిల్డర్ లక్షల రూపాయలు వసూలు చేసి వసతులు కల్పించకుడా తాత్సారం వహిస్తున్నాడని ఆరోపించారు. ఇంట్లోకి వచ్చిన తరువాత అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఒప్పందాన్ని ఉల్లంఘించిన బిల్డర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


ఆందోళన చేస్తున్న ఈస్ట్ కౌంటీ అపార్ట్‌మెంట్‌వాసులు

నేడు ఉచిత వైద్యశిబిరం

మల్కాజిగిరి: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మేడ్చల్ జిల్లా సహకారంతో ఆదివారం ఉదయం 10 గంటలకు ఆనంద్‌బాగ్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బిల్డింగ్ ఆవరణలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశామని గణపతి మ్యూచువల్లి ఎయిడెడ్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ప్రతినిధులు భరత్, మాధవరావు తెలిపారు. ఇతర వివరాలకు 85200 56633, 93469 75546లో సంప్రదించాలన్నారు.

నేడు నోటుపుస్తకాల పంపిణీ

గౌతంనగర్: తెలంగాణ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నోటు పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గౌతంనగర్ డివిజన్ జ్యోతినగర్ హాలులో గంగపుత్ర సంఘం విద్యార్థులకు నోటుపుస్తకాలను పంపిణీ చేయనున్నామని పేర్కొన్నారు.

జూలై 2న తైబజారు వేలం

బోడుప్పల్: జూలై 2వ తేదీన బోడుప్పల్ నగర పాలక సంస్థకు సంబంధించిన తైబజారు వేలం వేస్తున్నట్లు కమిషనర్ రాంలింగం వెల్లడించారు. బోడుప్పల్ నగర పాలక సంస్థ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ జూలై 16వ తేదీ నుంచి 2025 మార్చి 31వ తేదీ వరకు తైబజారు రుసుం లీజుకు ఇవ్వడానికి ఈ టెండర్ వేస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి కలిగినవారు కమిషనర్ పేరిట రూ.10 వేల డీడీ తీసి జూలై 1వ తేదీన సోమవారం సాయంత్రం 3 గంటల లోపు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు తీసుకుని, పూర్తి చేసి సమర్పించాలన్నారు.

నీట్‌పై విచారణ జరిపించాలి

మల్లాపూర్: నీట్ పరీక్ష అవకతవకలతో దాదాపు 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమాడుతున్న సంబంధిత మంత్రులు వెంటనే రాజీనామా చేయాలని దళిత జన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కో ఆర్డినేటర్ బొజ్జ రాకేష్ డిమాండ్ చేశారు. శనివారం నాచారంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీట్‌పై విచారణ జరిపించాలన్నారు. పరీక్షపై చర్చ నిర్వహించే ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు నీట్ వ్యవహారంపై స్పందించాలని డిమాండ్ చేశారు.

రోడ్డు నిర్మించాలని ధర్నా



మౌలాలి: ఆర్టీసీ కాలనీలో వెంటనే రోడ్డు వేయాలని కోరుతూ శనివారం కాలనీవాసులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 8 నెలల క్రితం కొత్త రోడ్డు వేస్తామని చెప్పి ఉన్న రోడ్డు తవ్వి వెళ్లిపోయారని, కాలనీవాసులమంతా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మేకల మోహన్ యాదవ్, పద్మ, బిందు, శోభ, దస్తగిరి శెట్టి, పాండు, సతీష్, శేఖర్, మేకల దీప్తి, శ్రీలతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్తా: ఎమ్మెల్యే


ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేసిన గీత పారిశ్రామిక సంఘం ప్రతినిధులు

కుషాయిగూడ: గీత పారిశ్రామిక సంఘం సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. చర్లపల్లి గీత పారిశ్రామిక సంఘం ప్రతినిధులు తమ సమస్యలపై శనివారం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. గతంలో గీత పారిశ్రామిక సంఘానికి కేటాయించిన స్థలంలో ఈత చెట్లను పెంచామని, ఇటీవల అధికారులు అందులో వాకింగ్ ట్రాక్, సీవరేజ్ నిర్మాణాలు చేపట్టడంతో ఈత చెట్లు పూర్తిగా పాడైపోయాయని విన్నవించారు. ఈ స్థలానికి బదులుగా మరోచోట 5 ఎకరాలను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కాసుల ఆనంద్ గౌడ్, రుద్రగోని రాంచందర్‌గౌడ్, నేమూరి మహేష్‌గౌడ్, నరసింహగౌడ్, ఆనంద్‌రాజ్‌గౌడ్, అంజయ్య, రాములు, అశోక్, శశికాంత్, శ్రావణ్‌కుమార్‌గౌడ్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

వసతుల కల్పనకు పెద్దపీట


సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్

మల్లాపూర్: మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం నాచారం డివిజన్ కార్తికేయనగర్ కాలనీ రోడ్ నెంబర్ 09, 10లలో రూ.40 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్తికేయనగర్ కాలనీ మిగిలిన రోడ్లను పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ రూప, ఏఈ లింగారావు, కార్తికేయనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు నాచారం బీఆర్ఎస్ పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్యను పరిష్కరించండి


స్థానికులతో మాట్లాడుతున్న ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి: పీవీఎన్ కాలనీలోని మంచినీటి సరఫరా సమస్యలను పరిష్కరించాలని జలమండలి అధికారులను కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ కోరారు. కాలనీలో శనివారం జలమండలి అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. పలుచోట్ల మీటర్లు పనిచేయడం లేదని, దీంతో నీటి సరఫరాకు ఇబ్బంది ఏర్పడుతోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని వీధుల్లో తగిన ప్రెజర్‌తో నీరు సరఫరా కావడం లేదని, సమస్య పరిష్కారమయ్యే వరకు నీటి సరఫరా సమయాన్ని పెంచాలన్నారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ నవీన్, వినయ్‌కుమార్, సైట్ ఇన్‌చార్జి ప్రణయ్, కాలనీవాసులు రుక్మిణి, సరస్వతి, లక్ష్మి, భాస్కర్, కిషోర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మలను ఆదుకోవాలని సంజయ్‌కు వినతి


కేంద్రమంత్రి బండి సంజయ్‌ను కలిసిన విశ్వకర్మ సంఘం నేతలు

రామంతాపూర్: ఉప్పల్ నియోజకవర్గం నేతలు విశ్వకర్మ సామాజిక వర్గ సమస్యలను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ దృష్టికి తెచ్చారు. కేంద్రమంత్రి వర్గంలో స్థానం దక్కినందుకు ఆయనను ఈ సందర్భంగా అభినందించారు. విశ్వకర్మల సమస్యలను సంబంధిత కేంద్రమంత్రి దృష్టికి తెచ్చి పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ సంక్షేమ సంఘం ప్రతినిధులు, బీజేపీ మాజీ కౌన్సిలర్ చింతూరు శ్రీనివాస్‌చారి, బండి పద్మ ప్రభాకర్‌చారి, రత్నం చారి, ఈశ్వరచారి, మురళి చారి, లింగం చారి తదితరులు పాల్గొన్నారు.

యోగా.. దివ్య ఔషధం



రామంతాపూర్: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో శనివారం యోగా కో ఆర్డినేషన్ కమిటీ ప్రధాన కార్యదర్శి, ప్రముఖ యోగథెరపి డాక్టర్ దొడ్ల సత్యారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా దినోత్సవానికి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగా ఒక దివ్య ఔషధం అని రోగాల నివారణకు యోగా అద్వితీయంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ యోగా ఫెడరేషన్ చైర్మన్ బ్రిజ్ భూషణ్, యోగా గురువు రామనాథం తదితరులు పాల్గొన్నారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

అల్వాల్: మాదకదవ్యాల వినియోగం వల్ల కలిగే మత్తే మనిషి జీవితాన్ని నాశనం చేస్తుందని, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని శనివారం నేరేడ్‌మెట్ ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం నేరేడ్‌మెట్ దీన్‌దయాళ్‌నగర్ పాషా పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులకు యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా, వాటితో కలిగే దుష్పరిణామాలు, చట్టపరమైన శిక్షలు వంటి అంశాల గురించి ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నిరీక్షణ్, హెడ్ కానిస్టేబుల్ నరేంద్రకుమార్, కానిస్టేబుల్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి ఆలయానికి వాటర్ కూలర్

మల్లాపూర్: మల్లికార్జునస్వామి దేవాలయానికి మల్లాపూర్, నాచారం అగర్వాల్ సమాజం ప్రతినిధులు 120 లీటర్ల సామర్థ్యం ఉన్న వాటర్ కూలర్‌ని శనివారం దేవాలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అగర్వాల్ సమాజం ప్రతినిధులకు దేవాలయ కమిటీ అధ్యక్షుడు అల్లాడి కృష్ణయాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అగర్వాల్ సమాజం, దేవాలయం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చేయూత





మల్కాజిగిరి: యూనియన్ డే సందర్భంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్‌యూహెచ్‌సీ సికింద్రాబాద్ రీజియన్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి సఫిల్‌గూడలోని మాతృ ఫౌండేషన్‌కు చేయూతనందించారు. రీజియన్ కార్యదర్శి నాగభాస్కర్ మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా సేవా కార్యక్రమాలు చేపట్టామని ఫౌండేషన్‌లోని చిన్నారులకు అవసరమయ్యే కూలర్లు, కిరాణా వస్తువులు, బ్రెయిలీ లిపిలో ఉన్న పుస్తకాలు, కుక్కర్లు, హాట్ ప్యాక్‌లు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌యూహెచ్‌సీ అధ్యక్షుడు సీహెచ్ శ్రీధర్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఆర్ శ్రీరామ్, డి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'మౌలాలి ఇండస్ట్రియల్'లో నో ఫుడ్‌సేఫ్టీ

తనిఖీలో వెలుగు చూసిన వైనం

మల్కాజిగిరి: మౌలాలి ఇండస్ట్రియల్ ఏరియాలోని రెండు పరిశ్రమల్లో ఫుడ్‌సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. డి.బి జోషి మసాలా తయారీ కంపెనీలో లేబుల్ లేకుండా ఉన్న 30 కిలోల చింతపండు, 300 కిలోల జీలకర్రను గుర్తించారు. అప్పడాలు తయారు చేయడానికి ఉపయోగిస్తున్న గడువు ముగిసిన బియ్యం పిండిని వాడుతున్నట్లు తేలింది. నిబంధనలు పాటించనందుకు వారికి నోటీసులు జారీ చేశారు. రమాబాయి జోషి ఇండస్ట్రీస్‌లో ఎఫ్‌బీఓలకు మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్ లేవని గుర్తించారు. కిటికీలు, వెంటిలేటర్స్‌కు పురుగులు రాకుండా నెట్స్ లేవు. కార్యాలయం ఆవరణంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్ లేదు. గడువు ముగిసిన పచ్చడి డబ్బాలను కూడా అధికారులు గుర్తించారు.


నాసిరకం పదార్థాలతో తయారైన అప్పడాలు


గడువు ముగిసిన పచ్చడి డబ్బాలు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220376 9912220571
9912225470 9505507657